


RNI No: APTEL/2018/76747

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక








| హైదరాబాద్ | మంగళవారం | సంపుటి: 9 | సంచిక: 245 | పేజీలు: 04 | వెల: 5 /- | 22 సెప్టెంబర్ 2026 |


# 'హైడ్రా' ప్రజావాణికి 47 ఫిర్యాదులు

**హైదరాబాద్, నవతరం:** బయట వారికే కాదు.. పక్క కాలనీ వాసులకు కూడా దారి లేకుండా చేస్తున్నారు. ఒకే లే ఔట్‌లో ఫేజ్ -1, ఫేజ్ -2 పేరిట ఉన్న వాటి మధ్యే గోడలు కడుతున్నారు. నివాస ప్రాంతాల్లో గోడవ పడాల్సి వస్తోందని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు స్పందించి మాకు దారి చూపాలంటూ కోకాపేటలోని లెజెండ్ చైమ్స్ ఫేజ్-2 కాలనీ నివాసితులు హైడ్రాను విజ్ఞప్తి చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ సెవెంత్ ఫేజ్‌లో పై అంతస్తులకు ఎలాంటి అనుమతులు లేకుండా 80 గజాల స్థలంలో 7 అంతస్తులు నిర్మిస్తున్నారని.. వెంటనే ఆపని పక్షంలో పక్కన ఉన్న నివాసాలకు ముప్పు పొంచి ఉంటుందని ఫొటోలు, వీడియోలను చూపించి హైడ్రా ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. మేహిదీపట్నంలోని సంతోష్‌నగర్ కాలనీలో ప్రభుత్వ భూమి ఉండగా.. అక్కడ అపార్టుమెంట్లు నిర్మిస్తున్న వారు ఆక్రమించేస్తున్నారని.. గ్రీన్ బెల్ట్ ఏరియాగా అభివృద్ధి చేయాలని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో కోరారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పశుమాముల గ్రామంలోని పార్కుకోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా ప్రజావాణికి 47 ఫిర్యాదులు రాగా వాటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. అక్కడికక్కడే వాటి పూర్వాపరాలలోకి వెళ్లి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

**ఫిర్యాదులు ఇలా..**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో 167 ఎకరాల్లో మహదేవ్‌పురం కాలనీ ఏర్పడింది. ఇందులో 80 వేల గజాల వరకూ పార్కులు, ప్రజావసరాలకు కేటాయించారు. ఇప్పుడవి ఆక్రమణలకు గురౌతున్నాయి. కాలనీలోని పార్కులు ప్లాట్లుగా మారిపోతున్నాయి. దాదాపు సగం వరకూ కబ్జాలు జరిగాయి. కబ్జాలను తొలగించి కాలనీలోని పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడాలని హైడ్రా ప్రజావాణిలో మహదేవ్‌పురం కాలనీ నివాసితులు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్‌లోని బొల్లారం, ద్వారకాపురి కాలనీలో అతిపెద్ద పురాతన బావి ఉంది. ఒకప్పుడు వ్యవసాయంతో పాటు తాగు నీటి అవసరాలకు ఈ బావిని వినియోగించేవారు. రహదారికి పక్కనే ఉన్న ఈ బావి ఇప్పుడు చెత్త డంపింగ్ కేంద్రంగా మారిపోయింది. మెడికల్ వేస్ట్‌ను కూడా ఈ బావిలో వేస్తున్నారు. దీంతో అక్కడ దుర్గంధం వ్యాపించడమే కాకుండా.. ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు కూడా కలుషితమౌతున్నాయి. హైడ్రా చెరువులను అభివృద్ధి చేస్తున్న సమయంలో వచ్చిన మట్టితో నింపాలని ద్వారకాపురి కాలనీ నివాసితులు హైడ్రా ప్రజావాణిలో కోరారు. పార్కుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారంలోని పర్కి చెరువును అభివృద్ధి చేయాలని మహదేవ్‌పురం డెవలప్‌మెంట్ ఫోరం హైడ్రా ప్రజావాణిలో విజ్ఞప్తి చేసింది. స్వచ్ఛమైన నీటితో ఉన్న ఈ చెరువులోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు కలిసి కలుషితమైపోయిందని.. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు రోగాల భారిన పడుతున్నారని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కూడా కలుషితమై చర్మ వ్యాధులతో పాటు.. శ్వాసకోశ ఇబ్బందుల పాలవుతున్నామని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల జాబితాలో పరికి చెరువును కూడా చేర్చాలని కోరారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, చింతల్‌మెట్ గ్రామంలోని శ్రీ హస్తాల వీరభద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన భూమి, పురాతన నీటి గుండం ఉన్నాయి. ఇప్పుడు వాటిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించడం, ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం చేస్తున్నారు. హైడ్రా రంగంలోకి దిగి దేవాలయానికి చెందిన భూమితో పాటు.. పురాతన నీటి గుండంను కాపాడాలని చింతల్‌మెట్ గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్ విలేజ్‌లో 212, 231, 209 సర్వే నంబర్లలో 18 ఎకరాల మేర సాయికృష్ణానగర్ ఎ, బి, సి పేరిట లే ఔట్ వేశారు. ఇందులో సర్వే నంబరు 209లో ప్లాట్లు అమ్మకాలు జరగకపోవడంతో లే ఔట్‌ను.. అదే సర్వే నంబరు వరకూ రద్దు చేశారు. 212, 231 సర్వే నంబర్లలోని ఎ., బి. సెక్టార్లలో దాదాపు 300ల వరకూ ప్లాట్లున్నాయి. ఇందులో ప్లాట్లు అమ్ముడవ్వడం.. 2011లో కొన్నిటికి ఎల్ ఆర్ ఎస్ రావడం కూడా జరిగింది. అయితే ఆ భూమిని అమ్మిన వారి వారసులు ఇప్పుడు ఏబీ సెక్టార్లలోని పార్కులు, రహదారులను కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. వాటిని కాపాడాలని హైడ్రా ప్రజావాణిలో సాయికృష్ణానగర్ నివాసితులు ఫిర్యాదు చేశారు.







# పరికిచెరువు ఆక్రమణలపై చర్యలేవి..?

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవతరం:** కూకట్పల్లి మండలం, కూకట్పల్లి గ్రామ పరిధిలో ఉన్న పరికి చెరువు(4801) గాజులరామారం గ్రామ పరిధిలోనూ విస్తరించి ఉండటంతో ఇక్కడి కబ్జాదారులకు 'లడ్డూ కావాలా నాయనా..' అన్నట్టు అదృష్టం కలిసి వచ్చింది. దీంతో.. కొందరు లంచగొండి ఇరిగేషన్ అధికారులతో దోస్తానా చేసి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లను సైతం ఆక్రమించి అక్రమ లేఔట్ లు చేసి అందినకాడికి దండుకుతిన్నారు కేటుగాళ్లు. ఇదే అదనుగా భావించిన కొందరు ఆశావహులు తక్కువ ధరకు ప్లాట్ లు దొరుకుతున్నాయని భావించి అందులో కొనుగోలు చేశామంటూ ప్రస్తుతం 'హైడ్రా' అధికారులను సవాలు చేస్తున్నారు. తమ వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయంటూ.. ఒకరంటే, సమాచారం సేకరించి వార్తలు రాసిన విలేకరులతో.. తాము అధికార పార్టీ కార్యకర్తలమని మరొకరు సిగ్గుమాలిన మాటలు మాట్లాడుతారు. 'గుమ్మడికాయల దొంగలెవరంటే.. భుజాలు దులుపుకున్నట్టు' చెరువు బఫర్ జోన్ లలో ప్లాట్ ల పేటిట కబ్జాలు చేస్తూ.. కొన్ని కోట్ల రూపాయల భూములకు ఎసరు పెట్టారు సదరు మాయగాళ్లు. మహదేవపురంలో తప్పుడు లే అవుట్ లు చేసి పార్క్, వాటర్ ట్యాంక్, రోడ్ల జాగాలు ఆక్రమించింది కాకుండా.. పక్కనే ఉన్న పరికి చెరువును సైతం మాయం చేసే ఆలోచనలో ఉన్న దొంగల ఎత్తుగడలు కొందరికి అర్థం కాక ఇప్పటికే కొనుక్కున్నా మంటూ చెప్పుకుంటూ.. బాధితులుగా మారడం సిగ్గుచేటనిపిస్తుంది. ఇంత జరిగినా తమ తప్పు తప్పు కాదని.. తమ కబ్జా.. కబ్జా కాదని వాదిస్తున్న వీరి తెలివితక్కువతనానికి స్థానిక జనం ముక్కుతో నవ్వుకుంటున్నారు. ఏది ఏమైనా.. 'అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులు అని చూడకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.


పరికి చెరువు ఆక్రమణలపై..

'హైడ్రా' అధికారులు ఉక్కుపాదం మోపాలి

తెలంగాణ రాష్ట్రంలో సహజవనరు లైనటువంటి చెరువులు, కుంటల పరిరక్షణకు 'ప్రజా ప్రభుత్వం' చాలా ప్రాధాన్యత ఇస్తుంది. చెరువుల సుందరీకరణకు బంగారు తెలంగాణ, ప్రజా ప్రభుత్వంలో కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి ప్రభుత్వాలు. ఓ వైపు రేవంత్ సర్కార్ 'హైడ్రా' లాంటి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసినా కూడా కొందరు కబ్జాదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. రాత్రిళ్ళు, పగలు అని తేడా లేకుండా ప్రభుత్వ భూములు, చెరువులు - కుంటలు ఆక్రమిస్తూ తమ సత్తా చాటుకుంటున్నారు. కేసులు చేస్తారన్న భయం లేదు, జైలుకు వెళ్తామన్న జంకు లేదు. ఓ వైపు కబజాలు చేస్తూ.. మరోవైపు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. కొందరు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను చూస్తూ.. అన్నీ తెలిసి కూడా తక్కువ ధరకు వస్తున్నాయని అందులో ప్లాట్ లు కొనుకకుంటుంటే.. మరోవైపు 'తమకేమి తెలియదు.. రిజిస్ట్రేషన్ పత్రాలున్నాయి' అని కొనుక్కున్నాం అంటూ సమర్థించుకుంటున్నారు మరికొందరు. గాజులరామారం గ్రామ పరిధిలోని ఆక్రమనలపై.. తప్పుడు రిజిస్ట్రేషన్ గుర్తించి ఇప్పటికే కొన్ని భూములకు ఫెన్సింగ్ వేశారు హైడ్రా అధికారులు.

కేవలం ఫెన్సింగ్ లకే పరిమితం కాకుండా తప్పుడు పత్రాలతో నిర్మించిన భారీ భావన నిర్మాణాలను సైతం నేలమట్టం చేశారు. అప్పటివరకూ తమకేమీ కాదు. తమ చెప్పు చేతుల్లో కొందరు 'లంచగొండి అధికారులున్నారు' అని నమ్మిన బడాబాబుల్లో సైతం గుబులు మొదలైంది. తెలిసీ తెలియక కొనుక్కున్నా, తెలిసి కొనుక్కున్నా తప్పు తప్పే కాబట్టి వ్యవస్థలను చాలెంజ్ చేయకుండా తమ తప్పు తెలుసుకుని సంబంధిత అధికారులకు సహకరించి, తమకు తప్పుడు భూములు అమ్మి సొమ్ము చేసుకున్న వారి నుండి తమ డబ్బులు ఎలా రికవరీ చేసుకోవాలో ఆలోచన చేసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతే కానీ నేరుంది కదా అని ప్రశ్నించినవారిపై తప్పుడు కూతలు కూసి, కొన్ని రోజుల్లో ప్రభుత్వం మారుతుంది.. అప్పుడు హైడ్రా లాంటి వ్యవస్థలు ఎలాగూ ఉండవు అంటూ 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తే.. 'హైడ్రా' లాంటి పులి పంజాకు బలి కాక తప్పదంటున్నారు నిపుణులు. 'పరికి చెరువు' ఆక్రమనలను గుర్తించి.. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని.. సదరు భూములను భవిష్యత్ తరాలకు అందించాలంటున్నారు స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు.

...వ్యక్తులు ఈ భూముల్లో ఇటుక ... పెట్టుకుని దందా (వ్యాపారం) చేసుకుంటుంటే.. మరికొందరు అక్రమంగా రూములు నిర్మించి, అక్రమ షెడ్లు వేసి వేరేవారికి నెలకింత అని కిరాయిలకు ఇస్తున్నారు. స్థానికులు 'వీటి ఎవరైనా.. వీటి వల్ల ఇబ్బంది కలుగుతుంది కదా' అని అడిగే ప్రయత్నం చేస్తే.. తెలియక కొనుక్కున్నాం.. ఏదయితేనేం.. గతంలో ఒకసారి రెవెన్యూ అధికారులు వీటిని కూల్చేశారు, ఇప్పుడూ అదే జరుగుతుంది ఇంకా మూడు నాలుగు లక్షలు ఖర్చయినా పెట్టుకుని మళ్ళీ నిర్మించుకుంటాం.. కొన్ని రోజుల్లో ప్రభుత్వం మారుతుంది. అప్పుడు హైడ్రా అనే వ్యవస్థనే ఉండదు. తద్వారా తమకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తుంది సదరు ఆక్రమణదారులు.

# మరికొంత కాలం యూపీఐ ఉచితంగానే కొనసాగించాలి

**న్యూ ఢిల్లీ, నవతరం:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలను మరికొంత కాలం పాటు ఉచితంగానే కొనసాగించాలని నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ ప్రభుత్వానికి సూచించారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న ఇటీవలి నిర్ణయంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ పలు కీలక అంశాలను వెల్లడించారు. యూపీఐ వ్యవస్థ నిర్వహణకు ఏటా సుమారు రూ.20,000 కోట్ల మేర వ్యయమవుతున్న మాట వాస్తవమే అయినప్పటికీ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ద్వారా దేశానికి లభించే ప్రయోజనాలు ఆ ఖర్చు కంటే చాలా ఎక్కువని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థలో నగదు వినియోగం గణనీయంగా తగ్గే వరకు యూపీఐ సేవలను ఉచితంగానే ఉంచడం శ్రేయస్కరమని ఆయన స్పష్టం చేశారు. చిన్న వ్యాపారులు, వర్తకులపై 0.4 శాతం మేర ఛార్జీలు విధిస్తే, వారిలో చాలామంది తిరిగి నగదు లావాదేవీల వైపు మళ్లే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇది డిజిటల్ చెల్లింపుల లక్ష్యానికి విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. యూపీఐ సేవలను ఉచితంగా కొనసాగించడం, అధిక విలువ కలిగిన లావాదేవీలపై ఛార్జీలు విధించడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




# యూపీఐ ఛార్జీలు వద్దు..

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు, నెలకు రూ. 10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు యూపీఐ లావాదేవీలు జరిపే రిటైలర్‌పై ప్రతి నెలా రూ.4,000 నుంచి రూ. 16,000 వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది. విక్రయాలు పడిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో మొబైల్ రిటైల్ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉందని అసోసియేషన్ తెలిపింది. దీనికి తోడు స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, 2025లో రూ. 10,000కు లభించిన ఎంట్రీ-లెవల్ స్మార్ట్‌ఫోన్ ధర ప్రస్తుతం రూ. 17,000కు చేరిందని, 2026 డిసెంబర్ నాటికి ఇది రూ. 20,000కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరహా రిటైలర్లకు యూపీఐ ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని, తక్కువ ఖర్చుతో కూడిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను కొనసాగించాలని ఏఐఎంఆర్ఏ ప్రభుత్వాన్ని కోరింది. ఫీజుల నిర్మాణంపై నిర్ణయం తీసుకునే ముందు వాణిజ్య సంఘాలతో సంప్రదింపులు జరపాలని విజ్ఞప్తి చేసింది.



# సాయికృష్ణ కస్టడీ డెత్.. సీఐ సహా ఏడుగురిపై సిట్ చార్జ్‌షీట్

- **గాదె సాయి కృష్ణ కస్టడీ మృతి కేసులో చార్జ్‌షీట్ దాఖలు**
- **కృష్ణలంక సీఐ నాగరాజు సహా ఏడుగురిని నిందితులుగా చేర్చిన సిట్**
- **పోలీసులే చిత్రహింసలు పెట్టి చంపి, మృతదేహాన్ని దహనం చేశారని ఆరోపణ**
- **సీఐ సహచరుడి వాంగ్మూలంతో వెలుగులోకి వచ్చిన దారుణ ఘటన**
- **డబ్బుతో కేసును సెటిల్ చేసేందుకు సీఐ ప్రయత్నించారని వెల్లడి**



**కృష్ణలంక, నవతరం:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ (25) అనుమానాస్పద కస్టడీ మరణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక ముందడుగు వేసింది. ఈ కేసులో కృష్ణలంక పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ) ఎస్.ఎస్.వి.వి. నాగరాజును ప్రధాన నిందితుడిగా (A1) పేర్కొంటూ, మరో ఆరుగురితో కలిపి మొత్తం ఏడుగురిపై సోమవారం విజయవాడ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. సాయికృష్ణను అక్రమంగా అరెస్ట్ చేయడం, కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం, దాని ఫలితంగా అతను మరణించడం, సాక్ష్యాలను నాశనం చేసేందుకు మృతదేహాన్ని దహనం చేయడం వంటి కీలక ఆధారాలను సిట్ కోర్టుకు సమర్పించింది. ఈ కేసులో నాగరాజుతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్ కుమార్, నాని, సీఐ సన్నిహితుడు గులివిందల సురేశ్, కానిస్టేబుళ్లు బాబూరావు, శ్యామయ్య, హోంగార్డు వెంకట్‌లను నిందితులుగా చేర్చారు. మే 6న పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత సాయికృష్ణ అదృశ్యమయ్యాడు. లాకప్‌లో తీవ్రంగా కొట్టడం వల్లే తన కుమారుడు చనిపోయాడని, ఆ తర్వాత మృతదేహాన్ని శ్మశానవాటికలో దహనం చేశారని అతని తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు జూన్ 19న పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) లోని సెక్షన్లు 127 (4), 127 (6), 103 (1), 238 కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తు కోసం ఐజీ (లా అండ్ ఆర్డర్) ఎం. రవిప్రకాశ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ రంగంలోకి దిగి జూన్ 21న సస్పెండైన సీఐ నాగరాజును అరెస్ట్ చేసింది. ఇటీవల నిందితుడు సురేశ్ కోర్టులో లొంగిపోయిన నాలుగు రోజుల తర్వాత సిట్ ఈ చార్జ్‌షీట్ దాఖలు చేయడం గమనార్హం.

### దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన దారుణం

సిట్ దర్యాప్తులో సురేశ్ ఇచ్చిన వాంగ్మూలం ఈ కేసులో కీలకంగా మారింది. విచారణ సమయంలో సాయికృష్ణను పోలీస్ స్టేషన్‌లో చూశానని, ఆ తర్వాత మే 12న రాణిగారి తోటలోని ఓ ప్రైవేట్ ఇంట్లో చూడగా, అతను దయనీయ స్థితిలో ఉన్నాడని సురేశ్ అంగీకరించాడు. పోలీసులు తనను ప్రతిరోజూ తీవ్రంగా కొడుతున్నారని సాయికృష్ణ తనతో చెప్పాడని సురేశ్ వెల్లడించాడు. తనతో మాట్లాడుతుండగానే సాయికృష్ణ కుప్పకూలిపోయాడని, హెడ్ కానిస్టేబుళ్లు నాడి చూసి చనిపోయినట్లు నిర్ధారించారని తెలిపాడు. సీఐ నాగార్జు ఆదేశాల మేరకు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు మే 12న అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి టూ-వీలర్‌పై స్వర్గపురి శ్మశానవాటికకు తరలించగా, తాను బైక్‌పై వారిని అనుసరించానని సురేశ్ వివరించాడు. అక్కడ ముగ్గురూ కలిసి మృతదేహాన్ని దహనం చేసినట్లు చెప్పాడు. సాక్ష్యాలు మిగిలి ఉన్నాయేమోనని నిర్ధారించుకునేందుకు మే 18న నాగరాజు, సురేశ్ మళ్లీ శ్మశానవాటికకు వెళ్లి పరిశీలించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా, ఈ విషయాన్ని బయటకు రాకుండా చేసేందుకు సీఐ నాగరాజు.. సాయి కృష్ణ మేనమామలు ముళ్లపూడి నవరం, నాగేశ్వరరావులను కలిసి డబ్బు ఆశ చూపి రాజీకి ప్రయత్నించాడని, కానీ వారు నిరాకరించారని సిట్ తన చార్జ్‌షీట్‌లో పేర్కొంది. రెండు నాన్-బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో మే 5న మార్కాపురంలో సాయికృష్ణను అదుపులోకి తీసుకుని, మరుసటి రోజు కృష్ణలంక పోలీసులకు అప్పగించినట్లు విచారణలో తేలింది.

# 'నందన' దంపతులపై ప్రజావాణిలో ఫిర్యాదు

**హైదరాబాద్, నవతరం:** యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసి మోసగించినట్లు యూట్యూబర్ నందన, ఆమె భర్త మధుకర్‌లపై ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ మేరకు బాధితులు సోమవారం ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. యూకే ప్రభుత్వం తమ కన్సల్టెన్సీకి ఉద్యోగుల నియామక ప్రక్రియ కోసం అనుమతులు మంజూరు చేసిందని నందన, మధుకర్ దంపతులు నమ్మబలికారు. ప్రధానంగా స్టూడెంట్, విజిటర్ వీసాలపై యూకేకు వెళ్లి, వీసా గడువు ముగియనున్న వారిని లక్ష్యంగా చేసుకుని వర్క్ వీసాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ. 25 లక్షల నుంచి రూ. 95 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అయితే, సదరు కన్సల్టెన్సీ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలడంతో యూకే ప్రభుత్వం తమపై కఠిన చర్యలు తీసుకుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో తెలంగాణలోని వికారాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారని వారు వివరించారు. సోమవారం బేగంపేటలోని జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో బాధితులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్‌పర్సన్, ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎన్నారై సలహా కమిటీ ఛైర్మన్ డాక్టర్ వినోద్ కుమార్‌లను కలిసి తమ సమస్యను విన్నవించారు. వారి నుంచి ఫిర్యాదును స్వీకరించిన అధికారులు, ఈ ఉదంతాన్ని రాష్ట్ర డీజీపీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టికి తీసుకెళ్లి, పూర్తిస్థాయి దర్యాప్తునకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.



# నారా రోహిత్ కొడుకు పేరిదే..

**అమరావతి, నవతరం:** యువ కథానాయకుడు నారా రోహిత్ కుటుంబంలోకి కొత్త ఆనందం వచ్చింది. ఇటీవల తండ్రి అయిన ఆయన, తన కుమారుడికి నామకరణం చేసినట్లు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. తమ అబ్బాయికి 'నందన్ రామ నారా' అని పేరు పెట్టినట్లు అధికారికంగా ప్రకటించారు.



# బేగంపేటలో భారీ చోరీ..

• 81 తులాల బంగారం, నగదు అపహరణ

**హైదరాబాద్‌లో, నవతరం:** బేగంపేటలో భారీ చోరీ చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమానగర్‌లో నివసిస్తున్న శ్రీనాథ్ నాయుడు అనే వ్యక్తి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఇంట్లో భద్రపరిచిన 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే, శ్రీనాథ్ నాయుడు కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని అల్మారాలో దాచిన నగదు, నగలు మాయమైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వెంటనే పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనాథ్ నాయుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.



# రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్ కు శంకుస్థాపన

**శేరిలింగంపల్లి, నవతరం:** నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.



# దూసుకొస్తున్న వాయుగుండం

**ఉత్తరాంధ్ర, నవతరం:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరం వైపు దూసుకొస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీకి ఆగ్నేయంగా 310 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు తూర్పు ఆగ్నేయంగా 310 కిలోమీటర్ల దూరంలో ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నానికి 390 కిలోమీటర్లు, విశాఖపట్నానికి తూర్పున 470 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై కొనసాగుతోంది. రాబోయే 24 గంటల్లో ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత కూడా ఇదే దిశలో కదులుతూ సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజాము మధ్యలో తీవ్ర వాయుగుండంగానే ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలను దాటుతుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరప్రాంతాల అధికారులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.



# అధికారం శాశ్వతం కాదు... వ్యక్తి చరిత్ర చెరిగిపోదు

**నవతరం, శ్రీకాకుళం:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాటల యుద్ధం హద్దులు దాటుతోందా? విమర్శల పేరుతో వ్యక్తిగత దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి ఏమైనా మేలు చేస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది..!. ఒక మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి, ఒక పార్టీ అధ్యక్షుడు, ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశించి "రా" అంటూ ఏకవచనంలో సంబోధించడం ఏపీ పొలిటికల్ సర్కిల్‌లో పెద్ద దుమారం రేపుతోంది. మాట తూటా కంటే ప్రమాదం... ఒక మాట రాష్ట్ర ప్రశాంతతనే దెబ్బతీస్తుంది" అంటూ ఘాటుగా చర్చ జరుగుతోంది. దివంగత మహానేత డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చారిత్రక సంక్షేమ పాలనతో దేశంలోనే ఏపీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరును ఉద్దేశపూర్వకంగా కించపరిచేలా చేస్తున్న విమర్శలు ఏపీ రాజకీయాల్లో కొత్త చిచ్చుకు ఆజ్యం పోస్తున్నాయి.

**అధికారం శాశ్వతం కాదు, చరిత్ర శాశ్వతం**

"ఎన్నికల్లో సీట్లు తగ్గితే చరిత్ర తగ్గిపోతుందా?. ప్రజాదరణ చెరిగిపోతుందా?" అనేది ఇప్పుడు వైసీపీ శ్రేణుల నుంచి వస్తున్న స్ట్రాంగ్ కౌంటర్. నేటికీ సింగిల్ పార్టీగా అత్యధిక జనాభా ఆదరణ కలిగిన నేత వైఎస్ జగన్. కారణాలేవైనా ప్రజా ప్రతినిధుల సంఖ్య తగ్గిందన్నంత మాత్రాన వ్యక్తి స్థాయి, ఆయన ఐదేళ్ల పాలనా చరిత్ర తగ్గిపోదు.అనేది కాదనలేని సత్యం. అధికారం ఉందని విర్రవీగడం, పదవుల అహంకారంతో నోరు జారడం ఎవరికీ మంచిది కాదని, ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అధికారం ఎవరికీ శాశ్వతం కాదు, అసలు ఈ సృష్టిలో జీవితమే శాశ్వతం కాదు అంటూ చురకలు వేస్తున్నారు.

**ఆవేశాలకు ఆజ్యం పోసే విమర్శలు... రాష్ట్ర ప్రశాంతతకు ముప్పు**

ఈ తరహా ఏకవచన విమర్శలు మాజీ ముఖ్యమంత్రిని అభిమానించే లక్షలాది మంది అభిమానులు, నాయకులు, కార్యకర్తల హృదయాల్లో మానసిక ఒత్తిడిని పెంచి, ఆవేశాలకు లోనయ్యే పరిస్థితులను కల్పించవా?.అని ప్రశ్నిస్తున్నారు. విమర్శలు సద్విమర్శలుగా ఉండాలి తప్ప, ఎదుటి వ్యక్తిని మానసికంగా ఇబ్బంది పెట్టేలా, కక్షపూరితంగా ఉండకూడదు. ఇటువంటి విధానాలు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు, వ్యక్తిగత కక్షలకు దారి తీస్తాయని, రాష్ట్రంలో ప్రశాంతత దెబ్బతినేందుకు కారణమవుతాయి. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారా? అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. ప్రజలు గమనిస్తున్నారు, ప్రతి మాటకు లెక్క ఉంటుందని, నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండొచ్చని గుర్తుపెట్టుకోవాలి. మొత్తంగా ఏపీ రాజకీయాల్లో భాషకు పట్టిన దుస్థితి, విమర్శల్లో హద్దులు దాటుతున్న తీరు రాష్ట్ర భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదని, ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష నేతలు విమర్శలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి, ఆవేశాలకు తావు లేకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని ఆశిద్దాం.



**సిరిగిరి వరదరాజు, చీఫ్ ఎడిటర్**
**నవతరం తెలుగు దినపత్రిక**

# 'మా వాటా' ఎక్కడుందో చెప్పాలి

**హైదరాబాద్, నవతరం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన ప్రజా పాలన అందిస్తుంటే, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు 22ఏ పేరిట రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు, కేసీఆర్ సొంత అన్న కూతురు రమ్యారావు మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా ఆస్తులు దోచుకుందని ధ్వజమెత్తారు. గతంలోనే తమకు వందల ఎకరాల భూములు ఉన్నాయని ప్రకటనలు చేస్తున్న కేటీఆర్.. అందులో మా వాటా ఎక్కడుందో చెప్పాలని రమ్యారావు డిమాండ్ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోశ్ రావు కేటీఆర్‌కు బినామీ కాబట్టే ఆయన ఆస్తులపై ప్రశ్నించకుండా మౌనంగా ఉంటున్నారా? అని ప్రశ్నించారు. గతంలో చెప్పులు వేసుకునే పరిస్థితి కూడా లేని సంతోశ్ రావుకు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భవనం, కొండాపూర్, మార్కుక్ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు, నానక్‌రామ్‌గూడలో ఆయన భార్య రోహిణి పేరిట భారీ కమర్షియల్ భవనాలు ఎలా వచ్చాయని నిలదీశారు. ప్రాజెక్టుల ముంపు పేరుతో కుదురుపాక గ్రామానికి సంబంధం లేని సంతోశ్ కుటుంబ సభ్యులు అక్రమంగా 8 ఇళ్ల ప్లాట్లను పొందారని, అయితే 2018 రాజ్యసభ అఫిడవిట్‌లో కేవలం ఒక్క ప్లాట్‌ను మాత్రమే చూపి సమాచారాన్ని దాచారని ఆరోపించారు. కేసీఆర్ దగ్గర ఉంటూ అడ్డగోలుగా సంపాదించిన సంతోశ్ రావును వెనకేసుకొస్తూ... కవితను, ఇంటి నుంచి బయటకు పంపిన వైనంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని రమ్యారావు సవాల్ విసిరారు.



# దమ్ముంటే అసెంబ్లీకి రండి

**అమరావతి, నవతరం:** "డీఎస్సీ నియామకాలపై దమ్ముంటే, ఆధారాలుంటే చర్చించడానికి అసెంబ్లీకి రండి.. వాస్తవాలతో మీ నోరు మూయిస్తాం. అంతేగాని, ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై దాడులు చేయడమేంటి?" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇవాళ విజయవాడలో జరిగిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. గురువులపై 'గొడ్డలి పార్టీ' దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కుప్పంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ, నియామక ప్రక్రియపై అభ్యంతరాలుంటే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉండగా, భౌతిక దాడులకు దిగడం రౌడీయిజానికి నిదర్శనమని మండిపడ్డారు.

**గురువులపై దాడులు బరితెగింపు**

ఉపాధ్యాయులపై దాడులు చేయడం దారుణమని, ఇది వారి బరితెగింపు చర్యలకు నిదర్శనమని చంద్రబాబు అన్నారు. "డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు తమవి కష్టార్జితమని చెబుతున్నారు. క్రీడల్లో పతకాలు సాధించి, నిబంధనల ప్రకారమే ఉద్యోగాలు పొందారు. అలాంటి వారిని ఫేక్ అనడం, వారిపై దాడులకు దిగడం ఎంతవరకు సమంజసం? మీడియా ముసుగులో కుప్పంలో ఓ వైసీపీ అనుకూల రిపోర్టర్ ఆర్భీలో పనిచేసి వచ్చిన ఉపాధ్యాయుడిపైనే దాడికి పాల్పడ్డాడు. ఇది వారి అరాచక మనస్తత్వానికి అద్దం పడుతోంది. తమను ఫేక్ అని అవమానించడాన్ని ప్రశ్నించినందుకు రౌడీలతో దాడులు చేయిస్తారా? గురువులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

**పారదర్శక నియామకాలే మా ట్రాక్ రికార్డ్**

తమ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "నా పాలనలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించాం. ఎక్కడా అవినీతికి, లీకేజీలకు తావులేకుండా పూర్తిచేశాం. మెగా డీఎస్సీ - 2025ను అడ్డుకోవడానికి ఏకంగా 355 పిటిషన్లు వేసినా, వాటన్నింటినీ అధిగమించి చట్టబద్ధంగా నియామకాలు చేపట్టాం. ఏడాది తర్వాత ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు" అని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు పొందిన వారికి గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన సర్టిఫికెట్ల ఆధారంగానే నియామకాలు జరిగాయని గుర్తుచేశారు.

- **గురువులపై దాడులను చూస్తూ ఊరుకోబోమని సీఎం చంద్రబాబు హెచ్చరిక**
- **డీఎస్సీ నియామకాలపై అభ్యంతరాలుంటే కోర్టుకు వెళ్లాలని సూచన**
- **రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని వ్యాఖ్య**
- **గత ప్రభుత్వమిచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగానే నియామకాలు జరిగాయన్న సీఎం**
- **స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపు**

"సర్టిఫికెట్లు ఇచ్చింది మీరు.. వాటి ఆధారంగా ఉద్యోగాలు పొందితే ఫేక్ అంటారా? కుక్క తోక వంకర అన్నట్టుగా ఉంది వీరి వ్యవహారం" అని ఎద్దేవా చేశారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఆరోపణలపై ఉపాధ్యాయులే స్వయంగా కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, తమ ఉద్యోగాలు కష్టార్జితమని నినదించారని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఇద్దరు మహిళా అధికారులు కూడా వాస్తవాలను వివరించారని, అయినా వైసీపీ నేతలు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. "ఆరోపణలు చేసేవారికి దమ్ముంటే అసెంబ్లీకి రండి. సాక్ష్యాధారాలతో సమాధానం చెప్పి, వారి అబద్ధాలు తేలుస్తాం" అని సవాల్ విసిరారు.

**రాజకీయ ముసుగులో రౌడీయిజం సహించం**

2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిందని, ఎన్నికల్లో ఓడిపోయినా ఆ పార్టీ నేతల హింసాత్మక ధోరణి మారలేదని చంద్రబాబు విమర్శించారు. "కుప్పంలో నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలిచ్చి రక్తాభిషేకాలు చేసే సంస్కృతి వారిది. రాజకీయ ముసుగులో ఇలాంటి రౌడీయిజాన్ని ఉపేక్షించం. వారి తోకలు కత్తిరిస్తాం. ఈ ప్రక్రియ కుప్పం నుంచే మొదలవ్వాలి" అని హెచ్చరించారు. అమరావతిని శ్మశానం అన్నవారు, నేడు అది అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వార్డు, ప్రతి పంచాయతీలో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

**హైదరాబాద్, నవతరం:** ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు.

జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.





# కాంగ్రెస్ సర్కార్‌పై డీకే అరుణ ఫైర్..

**హైదరాబాద్, నవతరం:** పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే, రాబోయే ఎండాకాలాన్ని బూచిగా చూపి కాలువలకు నీటిని నిలిపివేయడం ఏమాత్రం సమంజసం కాదని మండిపడ్డారు. జూరాల జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, కృష్ణా నదికి ఇంకా వరద వచ్చే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ వేసవిలో తాగునీటి ఎద్దడి వచ్చినా, ఎగువన కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి అక్కడి నుంచి నీటిని తెప్పించుకునేందుకు చొరవ చూపవచ్చని డీకే అరుణ సూచించారు. జూరాల డ్యాం రోడ్డు, కలెక్టరేట్ ఎదుట రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని, రైతుల పోరాటానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నీటి కొరత తీవ్రతను వివరిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. సాగు చేసిన పంటలు చేతికందేలా కాలువలకు నీరు విడుదల చేయాలని కోరడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని రైతులు కూడా పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ దశాబ్దాల సామాజిక, రాజకీయ ఆకాంక్షలకు, ఉద్యమ భావజాలానికి ప్రాతిపదికగా రాష్ట్ర రాజకీయ యవనికపై త్వరలోనే నూతన పార్టీ ఆవిర్భవించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి, తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదకశక్తిగా 'జన తెలంగాణ పార్టీ' రూపుదిద్దుకుంటోంది. లంకా పాపిరెడ్డి (లచ్చన్న), అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్, గురిజాల రవీందర్‌రావులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే, ఆపరేషన్ కగార్ అనంతర పరిణామాల్లో బయటకు వచ్చిన దేవ్‌జీ-సంగ్రామ్ లేదా సోనూ-ఆశన్న వర్గాలు ఈ పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావడం లేదని తెలుస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానంలోకి అడుగుపెడుతున్న ఈ కొత్త పార్టీ, త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ... హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. భారీ ప్రాజెక్టులు, జీడీపీ గణాంకాలే అభివృద్ధి కాదని, సామాన్యులకు ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ప్రశ్నించే స్వేచ్ఛే అసలైన అభివృద్ధి ప్రామాణికాలని తమ విధానపత్రంలో పొందుపరచనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలమైనా ప్రజా సమస్యలు తీరలేదన్న అభిప్రాయంతో ఉన్న ఈ బృందం, త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పార్టీ నమోదు కోసం అధికారికంగా దరఖాస్తు చేయనుంది.



# గెస్ట్‌హౌస్‌కు రమ్మన్నారు

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో ఓ మహిళా వ్యాపారవేత్త సోషల్ మీడియా పోస్ట్ రాజకీయ, అధికార వర్గాల్లో కలకలం రేపింది. తన వ్యాపార సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, సీఎంకు సన్నిహితుడిగా భావించిన వ్యక్తి ఒకరు తనను గెస్ట్‌హౌస్‌కు రావాలని కోరారంటూ మిథునా యాడ్స్ అధినేత కె.శోభారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తనకు ఎదురైన ఈ చేదు అనుభవాన్ని ఆమె 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ఔట్‌డోర్ అడ్వర్టైజింగ్ రంగంలో గత మూడేళ్లుగా తాను చట్టబద్ధంగా వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నానని శోభారెడ్డి తెలిపారు. రెగ్యులర్ టెండర్లు పిలిచే వరకు, రెవెన్యూ షేరింగ్ పద్ధతిలో తాత్కాలికంగా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్పందన కరువైందని ఆమె పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని సంస్థలపై నోటీసులు ఇచ్చినా నిర్మాణాలు కొనసాగుతున్నాయని, మరికొన్నింటికి జీవో నంబర్ 68 కింద మినహాయింపులు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే క్రమంలో, సీఎంకు సన్నిహితుడని తాను భావించిన వ్యక్తిని సంప్రదించానని శోభారెడ్డి వివరించారు. అయితే, ఆ విషయం మాట్లాడటానికి గెస్ట్‌హౌస్‌కు రావాలని ఆయన కోరడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తి పేరును బయటపెట్టడానికి ఇష్టపడటం లేదని, అయితే ఒక మహిళా వ్యాపారవేత్తగా తనకు ప్రత్యేక ప్రయోజనాలు అవసరం లేదని స్పష్టం చేశారు. కేవలం చట్టబద్ధమైన అవకాశం, సమానమైన ఆదరణ, గౌరవం మాత్రమే కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పోస్టును సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఖాతాలకు ట్యాగ్ చేయడంతో ఇది వేగంగా వైరల్ అయింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వ నిఘా వర్గాలు దృష్టి సారించి, ఆరా తీస్తున్నట్లు సమాచారం.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com